RAKSHANA_praja jyothi Medhak.qxd 2/19/2026 4:40 AM Page 1


# రక్షణ
## ఉమ్మడి గుంటూరు

గురువారం 19 ఫిబ్రవరి 2026 పేజీలు : 4


### 18 రోజుల తర్వాత జైలు నుంచి

# అంబటి విడుదల

**జైలులో ఇబ్బంది ఏమీ లేదు... మరింత కసితో ముందుకు వస్తా**



18 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలైన వైసీపీ నేత అంబటి రాంబాబు జైలు జీవితం తనలో మరింత కసిని నింపిందని తెలి పారు. బాత్రూంలో జారిపడిన ఘట న తప్ప ఇతర ఇబ్బందులు లేవ న్నారు. తనపై నమోదైన కేసులు రా జకీయ కక్షసాధింపేనని ఆరోపించారు.

వివరాలు 2లో..



# రంజాన్‌కు సిద్ధమైన మసీదులు..

**ప్రత్యేక ప్రార్థనలు**

**నెలవంక దర్శనంతో రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలోని మసీదులు ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమయ్యాయి. ఉపవాస దీక్షలతో ముస్లిం సోదరులు పవిత్ర మాసానికి స్వాగతం పలుకుతున్నారు.**

రక్షణ న్యూస్ గుంటూరు

రంజాన్ మాసం నేటి నుంచి ప్రారంభం కానుండటంతో జిల్లాలో భక్తి వాతావరణం నెలకొంది. మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు, తరావీహ్ ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు చేపట్టి, దానధర్మాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రంజాన్ నేపథ్యంలో ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో ముస్లిం ఉద్యోగులకు పనివేళల్లో వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఉద్యోగులు ఉపవాసాలు, ప్రార్థనలను సులభంగా ఆచరించేందుకు అవకాశం లభించింది. రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేస్తూ సోదరభావాన్ని చాటుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా మసీదులు, ఇళ్లలో ఆధ్యాత్మిక వాతావరణం పరచుకుంది.

# తెనాలి లో కలెక్టర్ తనిఖీలు



**విస్తృతంగా పర్యటించిన కలెక్టర్**

**తెనాలి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా విస్తృతంగా పర్యటించారు. మున్సిపల్ పరిధిలోని మౌలిక దుపాయాలు, గృహ నిర్మాణాలు, వ్యర్థాల నిర్వహణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.**

తెనాలి, ఫిబ్రవరి 18:

జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా బుధవారం తెనాలిలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తెనాలి మున్సిపల్

మిగతా 2లో



# పల్నాడులో మరోసారి ఏసీబీ దాడులు

**వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు రూ.70 వేలు లంచం... నెకరికల్లు లైన్‌మన్ అరెస్ట్**

వివరాలు 2లో..

# పార్లమెంట్ నూతన కార్యాలయ శంకుస్థాపనకు ముహూర్తం ఫిక్స్


బాపట్ల పార్లమెంట్ పరిధిలో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో నూతన ఆధునిక కార్యాలయ నిర్మాణానికి ఈ నెల 22వ తేదీ ఆదివారం ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వెల్లడించారు.



వివరాలు 2లో..

# గోవా నమూనాతో బాపట్ల బీచ్ అభివృద్ధి

**కలెక్టర్ వినోద్ కుమార్ నేతృత్వంలో ఉన్నత స్థాయి బృందం పర్యటన**



బాపట్ల సాగర తీరాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం కార్యాచరణను వేగవంతం చేసింది. పర్యాటక రంగంలో ముందంజలో ఉన్న Goa రాష్ట్రంలోని అభివృద్ధి నమూనాలను అధ్యయనం చేసేందుకు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం బుధవారం గోవా పర్యటనకు బయలుదేరింది.

వివరాలు 2లో..

# పార్లమెంట్ నూతన కార్యాలయ శంకుస్థాపనకు ముహూర్తం ఫిక్స్

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజుతో పాటు బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు నూతన కార్యాలయ నిర్మాణ వివరాలు మరియు పార్టీ భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాపట్ల నియోజకవర్గం వెదుళ్ళపల్లి భదిరుల ఆశ్రమ పాఠశాల సమీపంలో నిర్మించనున్న ఈ కార్యాలయం కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చీరాల ఎమ్మెల్య కొండయ్య సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. అదే రోజు బాపట్ల పార్లమెంట్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శంకుస్థాపన మహోత్సవానికి నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మరియు బావుడా చైర్మన్ పిలుపునిచ్చారు.

# తెనాలి లో కలెక్టర్ తనిఖీలు

మొదటి పేజీ తరువాయి

ప్రాంతంలో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంటు (ఎస్.టి.పి), టిడ్కో ఇళ్లు, డంపింగ్ యార్డు, బుర్రిపాలెం రోడ్డులోని అర్బన్ హౌసింగ్ లేఔట్, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం, నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కలెక్టర్, ప్రస్తుతం ఎస్.టి.పి ద్వారా రోజుకు 10 ఎం.ఎల్.డి మురుగునీటిని శుద్ధి చేస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 17 ఎం.ఎల్.డి మురుగు నీటిని శుద్ధి చేయాల్సి ఉందని చెప్పారు. వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ పనితీరును కూడా పరిశీలించినట్లు తెలిపారు. టిడ్కో గృహాలను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నిర్మాణాల నాణ్యతను పరిశీలించామని కలెక్టర్ చెప్పారు. బుర్రిపాలెం అర్బన్ హౌసింగ్ లేఔట్‌లో 2,880 గృహాలు నిర్మించాల్సి ఉందని, వాటిని వేగంగా పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అభ్యర్థులతో మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని సూచించారు. ఈ పర్యటనలో తెనాలి మున్సిపల్ కమిషనర్ జె. రామప్పలనాయుడు, ప్రజా ఆరోగ్య శాఖ ఇంజనీర్లు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె ప్రసాద్, ఇంచార్జ్ ఆర్డీవో లక్ష్మి కుమారి, తాహసిల్దార్ గోపాలకృష్ణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీసీటీవీ తో సక్సెస్

## చీరాల పోలీసుల చాకచక్యం... బాధితుడికి సురక్షితంగా నగదు అప్పగింత..

చీరాల రక్షణ న్యూస్




చీరాల పోలీసుల వేగవంతమైన స్పందనకు నిదర్శనంగా చీరాలలో జరిగిన ఘటన నిలిచింది. బ్యాంకు నుంచి డ్రా చేసుకుని వస్తూ మార్గమధ్యంలో పోగొట్టుకున్న నగదును కేవలం పది నిమిషాల్లో గుర్తించి బాధితుడికి అందజేసి చీరాల 1వ పట్టణ పోలీసులు ప్రజల ప్రశంసలు అందుకున్నారు. చీరాల 1టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఈ సంఘటన జరిగింది. స్థానికంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో నగదు డ్రా చేసుకుని వస్తున్న ఓ వ్యక్తి నోట్ల కట్ట జారిపడటంతో వెంటనే పోలీసులను ఆశ్రయించారు. చీరాల 1వ పట్టణ సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు, శక్తి టీం సిబ్బంది బాధితుడు వచ్చిన మార్గంలోని సీసీటీవీ ఫుటేజీను పరిశీలించారు. రవి షాపింగ్ మాల్ సమీపంలో నగదు జారిపడిన దృశ్యాలను గుర్తించి, దానిని తీసుకున్న వ్యక్తిని సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితుడికి సురక్షితంగా అప్పగించారు. ఫిర్యాదు చేసిన కొద్ది సేపులోనే స్పందించి నగదు అందించడంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ చీరాల 1వ పట్టణ పోలీసుల చురుకుదనాన్ని అభినందించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పోలీసులు పనిచేయాలని సూచించారు.

# పల్నాడులో మరోసారి ఏసీబీ దాడులు

నరసరావుపేట రక్షణ న్యూస్

మొదటి పేజీ తరువాయి

పల్నాడు జిల్లా అవినీతిపై కఠిన చర్యల భాగంగా అవినీతి నిరోధక శాఖ మరోసారి దాడులు నిర్వహించింది. నెకరికల్లు మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు కోసం రైతుని నుంచి రూ.70 వేల లంచం స్వీకరిస్తుండగా ఎలక్ట్రికల్ లైన్మన్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ యాంటీ కరప్షన్ బ్యూరో అదనపు ఎస్పీ మహేందర్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగింది. లైన్మన్ నాగేంద్రబాబు రైతుని నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ బృందం వల వేసిఅదుపులోకి తీసుకుంది. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ఇటీవల వరుసగా జరుగుతున్న ఏసీబీ దాడులు ప్రభుత్వ అవినీతి వ్యతిరేక వైఖరికి నిదర్శనంగా భావిస్తున్నారు. ఇప్పటికే పల్నాడులో మూడు సార్లు ఏసీబీ ఆపరేషన్లు నిర్వహించడం గమనార్హంఅవినీతి సహించబోమనే సంకేతాలు అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# గోవా నమూనాతో బాపట్ల బీచ్ అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్

ఈ నెల 19 నుంచి 22 వరకు కొనసాగనున్న ఈ పర్యటనలో బృంద సభ్యులు గోవాలోని ప్రముఖ బీచ్‌లు, పర్యాటక కేంద్రాలను సందర్శించి అక్కడి నిర్వహణ విధానాలను పరిశీలించనున్నారు. తీర ప్రాంతాల్లో పరిశుభ్రత నిర్వహణ, పర్యాటకుల భద్రతా చర్యలు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ విధానాలపై గోవా పర్యాటక శాఖ అధికారులతో చర్చలు జరపనున్నారు. బాపట్ల తీరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అవసరమైన సమగ్ర ప్రణాళికల రూపకల్పనలో ఈ అధ్యయనం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు పేర్కొన్నారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథ రెడ్డి, తహసీల్దార్ కె. గోపికృష్ణ, ఎంపీడీవో ఎం. రాజేష్ బాబు, జిల్లా పర్యాటక అధికారి అలీ అస్గర్ షేక్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రాజెక్ట్ మేనేజర్లు శివ శరణ్, సజిత్ షేక్ తదితరులు పాల్గొంటున్నారు. విజయవాడ విమానాశ్రయం నుంచి బయలుదేరిన బృందం ఈ నెల 22న తిరిగి రానుంది.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

## విద్యార్థినులకు పోలీసుల కఠిన హెచ్చరిక

బాపట్ల రక్షణ న్యూస్



బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల లో మాదకద్రవ్యాలు మరియు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సును జిల్లా పోలీసు శాఖ నిర్వహించింది. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు నిర్వహించిన విద్యార్థినులకు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాపట్ల క్రైమ్, ఇన్‌చార్జ్ డీఎస్పీ జగదీష్ నాయక్ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు బానిసలైతే వారి భవిష్యత్తు చీకటిమయం అవుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశలోనే డ్రగ్స్ వ్యసనం మేధోశక్తిని దెబ్బతీసి ఉన్నత లక్ష్యాల నుండి దూరం చేస్తుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాల రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో విద్యార్థుల సహకారం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఈగల్ సెల్ ఐజీపీ ఆ.ఖ రవికిష్ణ ఆదేశాల మేరకు జిల్లా ఈగల్ సెల్ సిబ్బంది కూడా పాల్గొని డ్రగ్స్ నివారణ చర్యలు మరియు సైబర్ నేరాలపై జాగ్రత్తలను వివరించారు. పరిసర ప్రాం తాల్లో ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగంలో పాల్గొంటున్నట్లు గమనించిన వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఐ. హరిత, ఈగల్ టీం సభ్యులు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 18 రోజుల తర్వాత జైలు నుంచి అంబటి విడుదల

గుంటూరు రక్షణ న్యూస్

మొదటి పేజీ తరువాయి

బెయిల్‌పై విడుదలైన అనంతరం మీడియాతో మాట్లాడిన అంబటి రాంబాబు, తన ఇంటిపై జరిగిన దాడి వెనుక అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. జైల్లో సాధారణ ఖైదీగా ఉన్నానని, లోపల ఇచ్చిన భోజనమే చేశానని చెప్పారు. ఆరోగ్యంగా ఉన్నానని, ఇకపై తన రాజకీయ పోరాటం మరింత ఉత్సాహంగా సాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర పరిణామాలపై పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత గుంటూరులో విలేకరుల సమావేశం నిర్వహిస్తానని వెల్లడించారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లుపక్కాగా ఉండాలి

### కలెక్టర్ కృతిక శుక్లా

**రక్షణ న్యూస్ నర్సరావుపేట**

ఈనెల 21వ తేదీన వినుకొండలో జరగనున్న గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనలో ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రతి శాఖ సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేశారు.'స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర' కార్యక్రమం పర్యటనలో భాగంగా వినుకొండలోని ఎన్.ఎస్.పి (చీఫ్రా) గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న ప్రజా వేదికను సర్వాంగ సుందరంగా సిద్ధం చేయాలన్నారు. ప్రజా వేదిక ప్రాంగణంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన స్టాల్స్‌ను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని, అక్కడికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు,



మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.అధికారులందరూ క్షేత్రస్థాయిలో నిమగ్నమై సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ కృతిక శుక్లా ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.ఈ సమావేశంలో జిల్లా ఏరియా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసూన, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ రీజినల్ అధికారిణి నజీరా బేగం, ఆసుపత్రి సూపరింటెండెంట్ దయానిధి, ఏపీ ఎం.ఎస్.ఐ.డి.సి అధికారి హనుమంతరావు నాయక్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సొంత శ్రేణులే అసంతృప్తి వైసిపి వైఖరి పై ప్రత్తిపాటి విమర్శలు

**అమరావతి రక్షణ న్యూస్**

ప్రజా సమస్యల కంటే వైసీపీ సభ్యులకు తమ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎజెండానే ముఖ్యమైపోయిందని మాజీ మంత్రి ప్రత్తిపాటి తీవ్ర విమర్శలు గుప్పించారు. మండలిలో వైసీపీ ఎమ్మెల్సీల ధోరణి ప్రజలకు ఉపయోగపడేదిగా లేకుండా కేవలం రాజకీయ రచ్చకే పరిమితమైందని ఆయన అభిప్రాయపడ్డారు.మంత్రివర్యుడు నారా లోకేష్ కొలంబో పర్యటనపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం మీడియా బరితెగింపునకు పరాకాష్టగా ఉందన్నారు. సొంత ఖర్చులతో క్రికెట్ మ్యాచ్ వీక్షించడానికి వెళ్లిన విషయాన్ని వక్రీకరించి ప్రజలపై అవాస్తవాలను రుద్దే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. దుష్ప్రచారానికి లోకేశ్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారని, గతంలోనూ హద్దులు మీరి ప్రచారం చేసి కోర్టుల్లో క్షమాపణలు చెప్పుకున్న సందర్భాలు ఉన్నప్పటికీ మార్పు రాలేదని వ్యాఖ్యానించారు.మండలికి వైసీపీ ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలపై చర్చించేందుకు కాకుండా సభను అడ్డుకోవడానికే వస్తున్నట్టుగా వారి వైఖరి కనిపిస్తోందని ప్రత్తిపాటి విమర్శించారు. రాష్ట్రానికి మేలు చేసే అంశాలపై సూచనలు ఇవ్వడం కన్నా ఒకే ఎజెండాతో సభా



కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని అన్నారు.టీటీడీ కు నెయ్యి సరఫరా అంశంపై హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ స్పష్టత ఇచ్చినప్పటికీ, ఆ సంస్థపై ఆరోపణలు చేయడం "కుక్కతోక పట్టుకొని గోదారి ఈదడమే"నని విమర్శించారు. కల్తీ నెయ్యి స్కామ్ అంశంలో నాటి ప్రభుత్వంపై జరుగుతున్న విచార ణల నుంచి ప్రజల దృష్టిని మళ్లిం చడానికే ఈ ప్రయత్నాలన్నీ జరుగుతున్నాయని ఆరోపించారు.

"సొంత శ్రేణులే అసంతృప్తి"వైసీపీ సభ్యుల ప్రవర్తనపై సొంత పార్టీ శ్రేణులే అసంతృప్తిగా ఉన్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. పెద్దల సభ గౌరవప్రతిష్టలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, ప్రజలకు ఉపయోగపడే అంశాల కంటే నాయకుడి ఆదేశాలకే ప్రాధాన్యం ఇస్తున్నట్టుగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.మండలి మర్యాదను కాపాడుతూ ప్రభుత్వ విధానాలపై నిర్మాణాత్మక చర్చ జరగాల్సిన అవసరం ఉందని, రాజకీయ ఆరోపణలకే పరిమితం కావడం ప్రజాస్వామ్యానికి మేలు కాదని ఆయన సూచించారు.

# మహిళలకు అండగా కేంద్రం

### వేటపాలెంలో జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం -- 12 స్వయం సహకార సంఘాలకు రూ.2.40 కోట్ల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొండయ్య

**వేటపాలెం రక్షణ న్యూస్**

చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య బుధవారం వేటపాలెం మండలం లో జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వేటపాలెం పరిధిలో ఉన్న 12 స్వయం సహకార సంఘాలకు మొత్తం రూ. 2.40 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.జెండర్ వనరుల కేంద్రం ద్వారా మహిళలకు ప్రత్యేకంగా రెండు రకాల సేవలు అందించబడతాయని ఆయన తెలిపారు. సహాయం కోరుతున్న వారికి అవసరమైన అన్ని సంబంధిత విషయాలపై సమాచారం అందించడంతో పాటు, న్యాయపరమైన హక్కులు మరియు బాధ్యతలపై సలహాలు




ఇవ్వబడతాయని వివరించారు. మహిళల సాధికారతకు ఈ కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య, వేటపాలెం మండల అధ్యక్షులు సీతారామాంజనేయులు, వేటపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు పోతురాజు, దేశాయిపేట గ్రామ పార్టీ అధ్యక్షులు మాచర్ల సాంబశివరావు, వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు, ఏటీఎం మధుసూదన్ రావు, వేటపాలెం ఏపీఎం అంజిబాబు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ధైర్యంగా పరీక్షలు రాయండి

### ఇంటర్మీడియట్ విద్యార్థులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ప్రేరణాత్మక సందేశం



**గుంటూరు రక్షణ న్యూస్**

ఇంటర్మీడియట్ పరీక్షలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో రాసి విజేతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో వసతి గృహాల్లో ఉండి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్ఫూర్తిదాయక సందేశాన్ని అందించారు.మార్చి 24 వరకు పరీక్షలు జరుగుతాయని, ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 87 కేంద్రాల్లో మొత్తం 68,898 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని వెల్లడించారు. సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు టాపర్స్‌గా నిలవాలని ఆకాంక్షించారు.పరీక్షల పట్ల భయాందోళనలకు లోనుకాకుండా ప్రశాంతంగా రాయాలని సూచించారు. ఇప్పటివరకు చదివిన అంశాలను క్షుణ్ణంగా పునఃశ్చరణ చేసుకోవాలని, బాగా తెలిసిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాయడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షలు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు పునాది వంటివని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షల్లోనూ ప్రతిభ చాటాలని విద్యార్థులను ప్రోత్సహించారు. వసతి గృహాల్లో చదివి ఉన్నత పదవులు సాధించిన అనేక మంది ఉదాహరణగా నిలిచారని గుర్తుచేశారు. కృషి, పట్టుదలతో లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని, విజువలైజే షన్ ద్వారా ప్రతి రోజు ప్రేరణ పొందాలని సూచించారు. గుంటూరు జిల్లా రాష్ట్ర స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షిస్తూ, ప్రతి వసతి గృహ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలనేదే తన ఆశయమని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి పి. మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా ఉండడమే రంజాన్ అసలు స్ఫూర్తి

### ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన ఫౌండేషన్ అధినేత విన్నకోట సురేష్..

**బాపట్ల రక్షణ న్యూస్**



పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా జన సేన నాయకుడు, అఖండ ఫౌం డేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ ముస్లిం సోదర సోదరీ మణులకు హృదయపూర్వక శుభా కాంక్షలు తెలిపారు. నెల రోజుల ఉపవాస దీక్షలు విజయవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు.రంజాన్ మాసం కేవలం ఉపవాసాలకు మాత్రమే పరిమితం కాకుండా క్రమశిక్షణ, సహనం, దాతృత్వానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. ఇస్లాం మతం మానవాళిపై ప్రేమను, పేదల పట్ల కరుణను బోధిస్తుందని చెప్పారు. ఉపవాసంతో పాటు 'జకాత్' రూపంలో పేదలకు సహాయం చేయడం ముస్లిం సమాజం గొప్ప సంప్రదాయం అని కొనియాడారు.బాపట్ల నియోజకవర్గంలోని ప్రతి ముస్లిం కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నానని తెలిపారు. అన్ని వర్గాల మధ్య ఐక్యత, సామరస్య వాతావరణం నెలకొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జనన, మరణ నమోదులపై కొత్త మార్గదర్శకాలు

నిర్దేశిత గడువులో నమోదు చేయాలి: నగర కమిషనర్ సూచన



గుంటూరు రక్షణ న్యూస్

జనన, మరణాల నమోదులపై రాష్ట్ర ప్రభుత్వం జీ.ఎం.ఎస్ నెం.28 ద్వారా నూతన మార్గదర్శకాలు జారీ చేసినట్లు నగర కమిషనర్ మయూరి అశోక్ తెలిపారు. మంగళవారం విడుదలైన ఈ ఉత్తర్వుల మేరకు 21 రోజులలోపు జనన, మరణాలను ఉచితంగా నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. 21 రోజుల గడువు దాటిన తర్వాత 30 రోజులలోపు నమోదు చేసుకోవాలంటే రూ.25 అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఒక సంవత్సరంలోపు నమోదు చేయాలంటే రూ.250 అపరాధ రుసుం చెల్లించడంతో పాటు జిల్లా జనన-–మరణ రిజిస్ట్రార్ అనుమతి అవసరమని చెప్పారు. సంవత్సరం దాటిన తర్వాత నమోదు చేయాలంటే జిల్లా మేజిస్ట్రేట్ లేదా ఆర్డీఓ వ్రాతపూర్వక అనుమతితో పాటు రూ.500 అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అలాగే బిడ్డ పుట్టిన తేదీ నుండి ఒక సంవత్సరంలోపు పేరును ఉచితంగా నమోదు చేసుకోవచ్చని, ఆ తర్వాత అయితే రూ.250 అపరాధ రుసుం వర్తిస్తుందని తెలిపారు. నగర ప్రజలు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించి నిర్దేశిత గడువులోనే జనన, మరణ నమోదులు పూర్తి చేయాలని కమిషనర్ కోరారు.

# రంజాన్ కు సమగ్ర ఏర్పాట్లు

మసీదుల వద్ద పారిశుధ్యం, నీటి సరఫరా, లైటింగ్‌పై ప్రత్యేక దృష్టి... కమిషనర్ ఆదేశం

గుంటూరు రక్షణ న్యూస్



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ మయూరి అశోక్ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలోని అన్ని మసీదులు, ఈద్గాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. రంజాన్ నెలలో వ్యర్థాల సేకరణ కోసం అదనపు సిబ్బందిని కేటాయించి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని ఆదేశించారు. మురుగు కాలువల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరం చేయాలని ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసే హలీం సెంటర్లకు తాత్కాలిక ట్రేడ్ లైసెన్సులు జారీ చేయాలని, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. ఆయా సెంటర్ల వ్యర్థాలను కమర్షియల్ ఏజెన్సీల ద్వారానే సేకరించాలన్నారు. మసీదులకు వెళ్లే ప్రధాన రహదారుల్లో వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలని, అవసరమైన చోట్ల తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, విఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, బయాలజిస్ట్ శేషయ్య, ఈఈ విష్ణు, సానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరిసిన గుంటూరు క్రీడాకారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందనలు

## పవర్ లిఫ్టింగ్, అస్మితా రోల్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన యువత

గుంటూరు రక్షణ న్యూస్

క్రీడా రంగంలో గుంటూరు యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశిష్ట విజయాలు సాధిస్తూ జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళ మాధవి తెలిపారు. ఇటీవల జరిగిన పవర్ లిఫ్టింగ్ మరియు రోల్ బాల్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆమె అభినందించారు. కర్నూలులో నిర్వహించిన అమరావతి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు క్రీడాకారులు పలు విభాగాల్లో మెడల్స్ సాధించారు. 76 కేజీల విభాగంలో టి. నాగజ్యోతి బంగారు పతకం సాధించడమే కాకుండా "ఉక్కు మహిళ" అవార్డు దక్కించుకున్నారు. టీం ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం సాధించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. పి. రేహాన్ ఖాన్ 53 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం సాధించగా, కే. సత్యరామరాజు అదే విభాగంలో డెడ్ లిఫ్ట్‌లో బంగారు పతకం గెలుచుకున్నారు. వినోద్ కుమార్ 74 కేజీల విభాగంలో డెడ్ లిఫ్ట్‌లో స్వర్ణ పతకం సాధించారు. అలాగే రోల్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా సింగరాయకొండలో నిర్వహించిన "అస్మితా రోల్ బాల్ లీగ్" పోటీల్లో గుంటూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కైవల్య శ్రీ, మనస్విని,



అమూల్య, హృతిక యశోద, లేహశృతి ఐదు మ్యాచ్‌లలో నాలుగు విజయాలు సాధించి ప్రతిభ కనబరిచారు. జనవరిలో హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కూడా టి. నాగజ్యోతి, జీ. స్వాతి పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, "మన విద్యార్థులు రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ మెడల్స్ సాధించి గుంటూరు పేరు ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టాలి" అని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు శిక్షణనిచ్చిన కోచ్‌లు షేక్ ఇమ్రాన్, షేక్ ఇష్రత్‌లను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఖమురుద్దీన్, షేక్ అబ్దుల్ రహీం, చంద్రగిరి బాబు, డాక్టర్ సుస్మిత, సయ్యద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లలో అలసత్వం సహించం.



నగరపాలక కమిషనర్ అశోక్

## ట్యాప్ డిస్కనెక్షన్, ఆస్తుల సీజ్‌కు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశం

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు నగరపాలక సంస్థకు బకాయి ఉన్న పన్ను వసూళ్లలో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని నగర కమిషనర్ మయూరి అశోక్ స్పష్టం చేశారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వారి విషయంలో ట్యాప్ డిస్కనెక్షన్, ఆస్తుల సీజ్ చర్యలకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో నిర్వహించిన రెవెన్యూ విభాగ సమీక్షా సమావేశంలో రోజువారీ వసూళ్ల లక్ష్యంపై ఆయన సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వసూళ్లు జరగకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, తక్కువ వసూళ్లు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రెండో అర్ధ సంవత్సరం ముగింపు సమయం సమీపిస్తున్నప్పటికీ ఆస్తి పన్ను, ఖాళీ స్థల పన్ను, త్రాగునీటి చార్జీలు, మీటర్ బిల్లుల వసూళ్లలో అలసత్వం ఎందుకు కొనసాగుతోందని ప్రశ్నించారు. బకాయిదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో స్పందించనివారి ట్యాప్, డ్రైనేజీ కనెక్షన్లు నిలిపివేయడం, రెడ్ నోటీసులు జారీ చేసి రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు తమ పరిధిలో వంద శాతం వసూళ్లు జరిగేలా బాధ్యత వహించాలని ఆదేశించారు. రోజువారీ పన్ను వసూళ్లు, డిమాండ్ స్లిప్స్ పంపిణీ, బకాయిదారులతో భేటీలపై నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రజలు సులభంగా పన్నులు చెల్లించేందుకు భారత్‌పేట, ఎల్ఆర్ కాలనీ, వసంతరాయపురం, గోరంట్ల, గుజ్జనగుండ్ల, సుద్దపల్లి డొంక సచివాలయాల్లో ఏర్పాటు చేసిన అదనపు కౌంటర్లపై విస్తృత ప్రచారం చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.